క్లుప్తంగా

ప్రమాదాల నివారణలో ఎన్జీఓలు భాగస్వామ్యం కావాలి



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్జీఓలు భాగస్వామ్యం కావాలని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శివరాం ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక డెప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయానికి విచ్చేసిన కమిషనర్ శివరాం ప్రసాద్‌ను జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులు ఆర్.కనకదుర్గపద్మజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల మృతుల గణాంకాల్లో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. అనేక రోడ్డు భద్రతా సూచనలు విస్తృతంగా ప్రచారం చేయడానికి ఎన్జీఓలు భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, మోటారు వాహనాల తనిఖీ అధికారి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూరియాపై అవగాహన



క్రోసూరు: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసు ఒక టీంగా ఏర్పడి యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తారని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. క్రోసూరు-1 రైతు సేవా కేంద్రంలో ఈ మేరకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో యూరియా వాడకం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని.. రైతులు అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వి.నాగరాజు, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు వ్యక్తి క్వారీ కుంటలో పడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన అంకమ్మ బాబు (41) మంగళవారం మధ్యాహ్నం గేదెలను కాపు కాసేందుకు గ్రామ సమీపన ఉన్న పొలాలకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం చేతులు శుభ్రం చేసుకునేందుకు సమీపంలోని క్వారీ కుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు లోనికి జారిపడి నీటిలో మునిగిపోయాడు. అయితే ఎంతకు బయటకు కనిపించకపోవడంతో శవాన్ని వెలికి తీసేందుకు గజ ఈతగాళ్లకు పోలీసులు తీసుకువచ్చి గాలింపు చర్యలు చేస్తున్నారు. రాత్రి వరకు శవం ఆచూకీ లభించలేదు.

వేధింపులపై ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చు

చిలకలూరిపేటటౌన్: మహిళలపై జరిగే ఎలాంటి వేధింపులకైనా న్యాయం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసీసీలో ఫిర్యాదు చేసుకోవచ్చని ఏఎస్‌సీ లీగల్ కౌన్సిలర్ వాణిశ్రీ చెప్పారు. మండలంలోని కమ్మవారిపాలెంలో మండల పరిషత్ ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీపీసీ షోషల్ కౌన్సిలర్ సంగీత మాట్లాడుతూ గృహాల్లో, పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపుల నివారణకు ఐసీసీలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వెళ్లకుండానే ఐదు రోజుల్లో సంబంధిత కేసుకు సంబంధించి ఉచిత న్యాయం మహిళలు ఐసీసీ ద్వారా పొందవచ్చన్నారు. నాదెండ్ల ఐసీడీఎస్ సీడీపీవో జి.శాంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐసీడీఎస్ కావూరు సెక్టార్ సూపర్‌వైజరు గౌసియా, భూలక్ష్మి, పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు మోడల్ పాఠశాల విద్యార్థులు





వినుకొండ: చీకటీగలపాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్, రాష్ట్రస్థాయి టెన్నికోయిట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. టి.సాయివివేక్‌వర్ధన్, సీహెచ్ ప్రసన్నకుమార్, వి.సుమ గుంటూరులో జరిగిన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. అదేవిధంగా శంకరభారతి పురంలో జరిగిన జిల్లాస్థాయి జూనియర్ టెన్నికోయిట్‌లో ఎ.పావని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పీడీ పాపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి

పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీఆర్కే



వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీఆర్కేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాణిక్యం తదితరులు

దుర్గి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన మండల పరిధిలోని ముటుకూరుకు చెందిన పులిమెల మాణిక్యం, పీఆర్కేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ మండల పరిధిలో అన్నీ గ్రామాలలో నాయకులను కలుపుకొని క్షేత్రస్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోవు రోజులలో ప్రజల పక్షాన పోరాడేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమాయత్తమవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం గడిచిన 15 మాసాలలో రైతులను, ప్రజలను దగా చేసి పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు. ఆయనను కలిసిన వారిలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, దుర్గి మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాచర్ల ఏసయ్య ఉన్నారు.

ఎరువుల పంపిణీని పర్యవేక్షించిన ప్రత్యేక అధికారుల బృందం



ఎరువుల కోసం వచ్చిన రైతులకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేక అధికారి నవీన్ కుమార్

కారెంపూడి: స్థానిక జీడీసీఎంఎస్‌లో ఎరువుల పంపిణీని మండల ప్రత్యేక అధికారి ఎం.నవీన్ కుమార్, తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, మండల వ్యవసాయశాఖ అధికారి పి.నరసింహారావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. అధికారులు స్వయంగా రైతులకు ఎరువుల కట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ అక్కడకు వచ్చిన రైతుల నుద్దేశించి మాట్లాడుతూ మార్కెట్‌లో నానో యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందన్నారు. నానో యూరియా అర లీటరు పైరుపై పిచికారి చేయడం వలన మొక్క ఆకుల ద్వారా 80 శాతం ఎరువును స్వీకరిస్తుందన్నారు. ప్రత్యేక అధికారి నవీన్ కుమార్ ఎకరాకు ఎన్ని కట్టల ఎరువు వేస్తారని ఆరా తీశారు. ఎకరాకు 6 నుంచి 8 కట్టలు వేస్తామని అక్కడున్న రైతులు తెలపడంతో ఏఓ రైతులకు ఎరువుల మోతాదు వివరణ ఇచ్చారు. యూరియా ఇప్పటికి కట్ట రూ.450 దాకా పలుకుతోందన్నారు. యూరియా ఎక్కువగా వాడవద్దని యూరియా కట్టకు కేంద్ర ప్రభుత్వం రూ.1,750 సబ్సిడీ అందిస్తోందన్నారు. యూరియాను అవసరానికి మించి వాడవద్దని పంట కాలంలో ఎకరాకు కట్టకు మించి యూరియా వాడవద్దని ఏఓ సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విజయకుమారికి సన్మానం



విజయకుమారిని సన్మానిస్తున్న ఎంఈఓ సురేష్

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తూ వారి ఉన్నతికి బాటలు వేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ గుర్తింపు పొందిన విజయకుమారి సేవలు మరువలేమని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కంభంపాడు జెడ్పీహెచ్ స్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రామిరెడ్డి విజయకుమారిని సన్మానించారు. 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయి మొదటి, రెండు, మూడు ర్యాంకులు సాధించి పల్నాడు ఉపాధ్యాయుల ప్రతిభను రాష్ట్ర వ్యాప్తంగా చాటిన ఘనత మనదేనన్నారు. విజయకుమారి హెచ్ఎంగా పాఠశాల అభివృద్ధిలో ప్రత్యేక స్థానముందని, విద్యార్థులకు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ వారిలోని ప్రతిభను వెలికితీయటంలో ప్రత్యేక శైలిని కనపరుస్తారని, ఆమె పనితీరు, తోటి ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. అవార్డు గ్రహీత విజయకుమారి మాట్లాడుతూ అవార్డు తనకు రావటంలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల సహాయ సహకారాల వల్లనే జరిగిందని, అది స్కూల్‌కే చెందుతుందన్నారు. కార్యక్రమంలో విజయకుమారి తల్లి నాగేంద్రమ్మ, ప్రముఖ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి, రామిరెడ్డి శివపార్వతి, ఉపాధ్యాయులు సైదమ్మ, తెడ్ల మురళి, కర్తయ్య, అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.

ముగిసిన కాకాని చేపల చెరువు వేలం

- హోరాహోరీగా సాగిన వేలం
- రూ.10.10 లక్షలకు పాటను దక్కించుకున్న కోటేశ్వరరావు
- ఆర్‌డీఓ మధులత ఆధ్వర్యంలో వేలం



వేలంపాటను నిర్వహిస్తున్న ఆర్డీఓ

నరసరావుపేట రూరల్: కాకానిలోని మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లో చేపల సాగుకు బహిరంగ వేలం పాట మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఆర్‌డీవో కె.మధులత ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. హోరాహోరిగా సాగిన వేలంపాటలో గ్రామానికి చెందిన ముద్దమూరి కోటేశ్వరరావు అత్యధికంగా రూ.10.10లక్షలకు చేపల చెరువును వేలంలో దక్కించుకున్నాడు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన వేలంపాటలో పాల్గొనేందుకు కాకానికి చెందిన చుండు కొండలరావు, ముద్దమూరి కోటేశ్వరరావు రూ.50వేలు దరావత్తు చెల్లించారు. 11గంటలకు ప్రభుత్వ నిర్ణయించిన ధర రూ.5.33,500లతో వేలం పాటను ఆర్డీవో ప్రారంభించారు. దరావత్తు చెల్లించిన ఇద్దరు చెరువును దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. 12వ పాటలో ముద్దమూరి కోటేశ్వరరావు రూ.10.10 లక్షలకు పాడగా కొండలరావు అంతకంటే అధికంగా పాడేందుకు ముందుకు రాలేదు. దీంతో చేపల వేలంను ముద్దమూరి కోటేశ్వరరావు దక్కించుకున్నట్టు ఆర్డీవో మధులత ప్రకటించారు. వేలంలో పాటను దక్కించుకున్న పాటదారుడు వారం రోజుల్లో మొత్తాన్ని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని ఆర్డీవో తెలిపారు. పాటదారుడు నిర్ణీత సమయంలో మొత్తాన్ని చెల్లించకపోతే రెండవ పాటదారుడికి వేలం దక్కుతుందని పేర్కొన్నారు. పాట దారుడు 30-06-2026 వరకు చేపల సాగు చేసుకునే హక్కు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో కృష్ణకుమారి, మైనర్ ఇరిగేషన్ ఏఈ కిరణ్ కుమార్, మత్స్యశాఖ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన కూటమి వ్యూహం

గత సంవత్సరం వేలం పాట నిర్వహించకుండానే కూటమి నాయకులు అనధికారికంగా చేపల సాగును చెరువులో చేపట్టారు. ఈ ఏడాది కూడా వేలాన్ని అడ్డుకునేందుకు కూటమి నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. వేలంపాటలో పాల్గొనకుండా గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ ధరకే వేలంను దక్కించుకునే వ్యూహం పన్నారు. అయితే వేలంలో ఇద్దరు పాల్గొనడంతో టీడీపీ నాయకుల పథకం బెడిసికొట్టింది. చేపలచెరువు సాగు అవకాశం ఈ ఏడాది మాకు ఇవ్వాలని టీడీపీ నాయకులను అదే పార్టీకి చెందిన ఎస్సీ కాలనీ నాయకులు అడిగారు. దీనికి గ్రామ నాయకులు అంగీకరించకపోవడంతో వేలంలో పాల్గొనాలని ఎస్సీ కాలనీ నాయకులు నిర్ణయించారు. ఇందు కోసం రూ.10 లక్షల వరకు సమీకరించారు. ఈ మేరకు వేలంపాటలో పాల్గొని రూ.10 లక్షల వరకు పోటీలో నిలిచారు.

ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేదయ్యా..

- వ్యవసాయ అధికారులను నిలదీసిన కాకాని గ్రామరైతులు
- గ్రామంలో యూరియా కొరతపై అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న డీఏవో జగ్గారావు, ఇతర అధికారులు
- ఎరువుల సరఫరా లేకపోవడంతో ప్రశ్నించిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న జగ్గారావు

నరసరావుపేట రూరల్: గ్రామంలో అన్ని పంటలు పండిస్తున్నా ఒక్క బస్తా యూరియా ప్రభుత్వం నుంచి అందలేదని కాకాని రైతులు వ్యవసాయ అధికారులను నిలదీశారు. గ్రామంలో ఉన్న ఆర్‌బీకేను మూసివేశారు. యూరియా కావాలంటే పెట్లూరివారిపాలెం రైతు సేవా కేంద్రంకు గాని, ఉప్పలపాడు సొసైటీకి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ యూరియా అందుబాటులో లేకపోవడంతో నరసరావుపేటలోని దుకాణాల్లో రూ.400కు పైగా చెల్లించి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నా తమకు మాత్రం అందడం లేదని రైతులు వ్యవసాయ అధికారులకు స్పష్టం చేశారు. యూరియాపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శాంతిలు మంగళవారం పెట్లూరివారిపాలెం, కాకాని గ్రామాల్లో పర్యటించారు. కాకానిలో జగ్గారావు మాట్లాడుతూ యూరియా కొరతపై అపోహలు నమ్మవద్దని, జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని డీఏవో జగ్గారావు రైతులకు వివరించారు. గ్రామాల్లో యూరియా కొరత ఉందని తెలిస్తే ఆర్ఎస్‌కేలు, సొసైటీల ద్వారా అందజేస్తామని తెలిపారు. ఖరీఫ్‌కు 34,500 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 36 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చిందని, ఇప్పటికే 33 వేల మెట్రిక్ టన్నులు విక్రయించినట్టు తెలిపారు. 3 వేల టన్నుల నిల్వలు జిల్లాలో ఉన్నాయని, మరో ఐదువేల టన్నుల కావాలని ప్రభుత్వాన్ని అడిగినట్టు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి ఒక్క బస్తా కూడా ఇవ్వకుండా కొరత లేదు అని ఎలా చెబుతారని నిలదీశారు. గ్రామానికి ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నారై కళాశాల వద్ద కారు ప్రమాదం



మేడికొండూరు: మండల పరిధిలోని విశదల ఎన్నారై కళాశాల సమీపం వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్లకు చెందిన ఎర్రం శ్రీనివాసరావు కుమారుడు కృష్ణ(26) గుంటూరు నుంచి పిడుగురాళ్ల వైపు కారులో ప్రయాణిస్తున్నారు. మేడికొండూరు నుంచి గుంటూరు వస్తున్న మరో కారు వేగంగా యువకుడి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడే ద్విచక్ర వాహనంపై నిలబడి ఉన్న మరియదాసు, గాలయ్య, వెంకట్రావు, శీను అనే నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు గాయపడిన వారికి తక్షణ సహాయం చేశారు. సమాచారం అందుకున్న మేడికొండూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.


గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



పెదకూరపాడు: గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం గైనకాలజిస్ట్ డాక్టర్ కూచిపూడి సుజాత సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేశారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఐదేళ్ల నుంచి గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: బిడ్డలు ఆరోగ్యంగా జన్మించాలంటే గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు అన్నారు. అమరావతికి చెందిన పోలిశెట్టి సాయిబాబు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన 50 మంది గర్భిణులకు మంగళవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి ప్రతినిధి షేక్ లియాకత్ ఆలి, సరస్వతి శిశుమందిర్ ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు యాంటీ లార్వా పిచికారి



బెల్లంకొండ: గ్రామాల్లో దోమల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ సిబ్బంది యాంటీ లార్వా ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నారు. మంగళవారం మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం, వన్నాయపాలెం, ఎమ్మాజీగూడెం, రామాంజనేయపురం, కందిపాడు, నందిరాజుపాలెం, మాచాయపాలెం గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కిరణ్ తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డికి చిత్రపటం బహూకరణ



కాసుకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల/పిడుగురాళ్ల రూరల్: గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పవన్‌రెడ్డి లోకల్ యూత్ ఆధ్వర్యంలో కాసు మహేష్‌రెడ్డికి చిత్రపటాన్ని బహూకరించారు. తొలుత కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కాసు శ్రీకాంత్‌రెడ్డి, గొట్టిముక్కల వపన్ రెడ్డి, పల్నాడు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు గొట్టిముక్కల మట్టారెడ్డి, పల్నాడు జిల్లా షోషల్ మీడియా సెక్రటరీ ఇర్లా శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు మిట్టా జంగమయ్య, సైదారెడ్డి పాల్గొన్నారు. కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ పట్టణ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. పట్టణంలోని 5వ వార్డులోని అమ్మా లారీ ఆఫీస్‌లో మంగళవారం గురజాల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మంగళవారం కరాలపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యాపక విభాగ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. సుమారు 5 వేల మందికి మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

దాచేపల్లి: నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ ను నాయకులు కట్ చేశారు. అంజనాపురంలో అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల జాను, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగుండ్ల ప్రకాష్ రెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయకుమార్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, సర్పంచులు కూసం నాగిరెడ్డి, వెంకటాచారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాచవరం: స్థానిక లయోలా ప్రేమ నివాసంలో నందు కేక్ కటింగ్ చేసి చిన్నారులకు పండ్లు ,మిఠాయిలు పంపిణీ చేశారు .

గురజాల రూరల్: స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సిస్టర్ తుమ్మ సుజాత

మాచర్ల: రాష్ట్ర స్థాయి అండర్- 14 సాఫ్ట్‌బాల్‌లకు మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ తుమ్మ సుజాత మంగళవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపికలు రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఇటీవల నిర్వహించారు. రాష్ట్ర సాఫ్ట్ బాల్ ఆర్గనైజర్ సెక్రెటరీ పి.నరసింహారెడ్డి, గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ సెక్రటరీ పి.సామంత రెడ్డి, గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాలుర విభాగంలో మత్తే భూపేంద్ర కుమార్, అందుగుల అగస్త్య ఆనంద్, యశ్వంత్ కుమార్, స్టాండ్ బాయ్‌గా శ్రీహరి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వివరించారు. బాలికల విభాగంలో మత్తే విజయలక్ష్మి ఎంపిక కాగా వీరు అక్టోబర్ నెలలో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా సిస్టర్ తుమ్మ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాగా ఆడి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిస్టర్ శ్వేత, సంతోష్, మత్తే కుమార్, వెంకటేష్, రత్న ప్రకాష్, వినేష్, చౌర రాజు, వరప్రసాద్, ప్రతాపు, నాగేశ్వరరావు, శ్రీను, మధురవాణి, అనూష, సబితా, మెర్సి, శ్రీదేవి, వర్షిని పాల్గొన్నారు.

అధిక యూరియా వినియోగంతో అనర్థాలు



అడిగొప్పలలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: అధికంగా యూరియా వినియోగించటం వలన మొక్కలపై చీడపీడలు ఎక్కువ ఆశిస్తాయని మండల వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడిగొప్పలలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. యూరియా వలన కలిగే లాభనష్టాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఒక బ్యాగు యూరియా తయారు చేయటానికి రూ.2,250 ఖర్చు అవుతుందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు సబ్సిడీని భరిస్తోందని చెప్పారు. ప్రతి యేటా కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు సబ్సిడీని రైతులకు అందిస్తుందని వివరించారు. యూరియాను అధికంగా వినియోగించటం వలన చీడ పీడ పురుగులు పెరిగి మందులను వాడటంతో మందుల అవశేషాలు అధికంగా, పండ్లు, కూరగాయలు, ధాన్యంలో ఉంటున్నాయని దీని వలన తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని వివరించారు. యూరియాను తక్కువగా వినియోగించుకొని సేంద్రియ ఎరువును ఉపయోగించుకున్నట్లయితే మార్కెట్ ధరలు బాగా ఉండి ఎగుమతులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా 50 కిలోల యూరియా బస్తా వినియోగాన్ని తగ్గిస్తూ నానో యూరియాను పిచికారి చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టాలి



శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు



మెట్లు దెబ్బతిన్న వాటర్ ట్యాంకు

క్రోసూరు: క్రోసూరు గ్రామంలోని 1, 2 వార్డు ప్రజలకు మంచినీటిని అందించడానికి నిర్మాణం చేపట్టిన మంచినీటి ట్యాంకుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వారు డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిల్కా ఏషియ్య మాట్లాడుతూ.. మంచినీటి ట్యాంకు శుభ్రం చేయడానికి ఏర్పాటు చేసిన మెట్లు పూర్తిగా విరిగిపోయాయని.. దీంతో ట్యాంకు శుభ్రం చేయడానికి వీలుకావడం లేదని.. వెంటనే మెట్ల మార్గాన్ని పునర్నిర్మాణం చేసి, ఇతర మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎలిజిబెత్, ఏసుబాబు, రాంబాబు, బాలరాజు, వినయ్, చిన్నబ్బాయి, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఈనెల 15న రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అవ్వారు ప్రసాదరావు, సీఐటీయూ నాయకులు

సత్తెనపల్లి: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్లో కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి వాల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన విజయవాడలోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులందరూ తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులందరూ చలో విజయవాడకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోట ఆంజనేయులు, జి.సాల్మన్‌రాజు, సీఐటీయూ నాయకులు ఆర్.పురుషోత్తం, ఎం.హరిపోతురాజు, స్థానిక భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కీలకం

సత్తెనపల్లి: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన కీలకమని డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఎంపీపీలు, సర్పంచ్‌లకు రెండు రోజులు నిర్వహించే డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్ష్యాల సాధనకు ప్రజా ప్రతినిధులు అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణకు సత్తెనపల్లి, ముప్పాళ్ళ, నకరికల్లు, క్రోసూరు, బెల్లంకొండ మండలాల మండల పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బుధవారం కూడా శిక్షణ కొనసాగుతుందని, గురు, శుక్రవారాలు అమరావతి, అచ్చంపేట, రాజుపాలెం, పెదకూరపాడు మండలాల ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమానికి డి.ప్రదీప్ కుమార్, కె.ఏసోబు, జి.సదా శివకుమారి, సురేఖలు ట్రైనర్‌లుగా వ్యవహరించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్, ఫణిదం పాల్గొన్నారు.